సాక్షి
ఏలూరు
బుధవారం । 22 । నవంబర్ । 2023



గురుకుల విద్యార్థి ఆత్మహత్య
పెదవేగి గురుకుల విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న కమలేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అధికారులు విచారణ నిర్వహించారు. 8లో ▸



రోడ్ల అభివృద్ధి వేగవంతం
జిల్లాలోని ప్రధాన మార్గాలతో పాటు, లింకు రోడ్ల పనులు వేగంగా సాగుతున్నాయి. వరదలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. 8లో ▸



శ్రీవారి సన్నిధిలో...
ద్వారకాతిరుమల: వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ నండూరి ఉమ మంగళవారం సందర్శించారు.

న్యూస్‌రీల్

మద్దతు ధర కల్పించడమే లక్ష్యం



కామవరపుకోట ఆర్బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ కోటగిరి శ్రీధర్

కామవరపుకోట: పంటకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక విశాల సహకార సంఘంలోని రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో వ్యవసాయం దండగని టీడీపీ పాలకులు హేళన చేసి రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేశారని, పండించిన పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో, రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునేవారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి రైతు సంక్షేమమే లక్ష్యంగా, రైతు భరోసా, జలకళ, వంటి పథకాలే కాకుండా, దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. పంటకు మద్దతు ధర కల్పించడంతోపాటు, వారికి రావలసిన సొమ్మును, 21 రోజుల్లో జమ చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్‌బాబు, సొసైటీ చైర్మన్ సాయన కనకరాజు, సెక్రటరీ బాబురావు, రాష్ట్ర ముదిరాజ్ సంఘం డైరెక్టర్ చిక్కుళ్ళ శ్రీను, మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్, సర్పంచులు కరిపోతు అనూష, దేవరపల్లి రామ్మోహనరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక ట్యాబ్‌లు



ట్యాబ్‌లు అందజేస్తున్న కలెక్టర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దివ్యాంగుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం మెరుగైన సేవలు అందిస్తుందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక అశోక్‌నగర్‌లోని అశోకవర్ధన స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దృష్టి లోపం, వినికిడి లోపం కలిగిన విద్యార్థులకు, ఐఈఆర్‌పీలకు ట్యాబ్‌లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టి లోపం, వినికిడి లోపం కలిగిన వారికి ప్రభుత్వం భరోసా కల్పిస్తూ వారి విద్యాప్రమాణాలను మెరుగుపరిచి వివిధ రంగాల్లో ఉపాధి కల్పన చేపడుతుందని చెప్పారు. ఈ ట్యాబ్‌ల్లో ప్రత్యేకమైన యాప్‌ను పొందుపరిచారని దీని ద్వారా విద్యార్థులకు సాంకేతికపరమైన అవగాహన కలుగుతుందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ జిల్లాలోని సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 28 భవిత కేంద్రాల్లో ఉన్న 545 మంది విద్యార్థులకు 110 ట్యాబ్‌లు అందచేశామని, 55 మంది ఐఈఆర్‌పీలకు 63 ట్యాబ్‌లు పంపిణీ చేశామని తెలిపారు.

24 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 24 నుంచి డిసెంబర్ 8 సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు నిర్వహించే ఈ పరీక్షలకు ప్రశ్నాపత్రాలను రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో తయారు చేశారన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల ప్రశ్నాపత్రాలు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు ఏ రోజుకారోజు ఉదయం 8 గంటల నుండి 9 గంటల మధ్యలో సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి తీసుకోవాలన్నారు.

10వ తరగతి పరీక్షకు ఫీజు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు, గతంలో అనుత్తీర్ణత పొంది ప్రస్తుతం ప్రైవేటుగా హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా రుసుం చెల్లించడానికి గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ.శ్యామ్‌సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించవచ్చని రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 1 వరకు రూ.200 అపరాధ రుసుంతో డిసెంబర్ 5 వరకు రూ. 500 అపరాధ రుసుముతో డిసెంబర్ 10 వరకూ ఫీజు చెల్లించవచ్చన్నారు.

చివరిలో అలజడి

- ఉమ్మడి జిల్లాలో మొదలైన ఖరీఫ్ మాసూళ్లు
- వాతావరణంలో మార్పులతో పలుచోట్ల వర్షం
- ఉమ్మడి జిల్లాలో 4.17 లక్షల ఎకరాల్లో సార్వా సాగు
- 63 వేల ఎకరాల్లో పూర్తయిన వరికోతలు



ధాన్యం ఒబ్బిడి చేస్తున్న రైతులు

సాక్షి, భీమవరం: ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో వాతావరణ మార్పులు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తొలకరి సాగు తుది దశకు చేరుకోవడంతో వరి కోతలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 15 శాతం మాసూళ్లు పూర్తయ్యాయి. ప్రస్తుత దశలో వాతావరణ మార్పులతో ఆకాశం మేఘావృతమై జల్లులు పడుతుండటం రైతులను కలవరపరుస్తోంది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 4.17 లక్షల ఎకరాల ఆయకట్టుకు గాను ఏలూరు జిల్లాలో 1.98 లక్షల ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2.19 లక్షల ఎకరాల్లో రైతులు సార్వా పంటను సాగుచేశారు. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, తణుకు, ఆచంట, పెనుగొండ తదితర ప్రాంతాల్లో వరికోతలు మొదలవగా మిగిలిన ప్రాంతాల్లో పనులు ఇప్పుడిప్పుడే ముమ్మరమవుతున్నాయి. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం మంగళవారం నాటికి ఏలూరు జిల్లాలో 30,800 ఎకరాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 33 వేల ఎకరాల్లో కోతలు పూర్తిచేయగా అక్కడక్కడ పంట పనలపై ఉంది. డిసెంబరు రెండవ వారం నాటికి ఖరీఫ్ చివరి దశ పనులు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ఈ సీజన్‌లో 44 శాతం లోటు వర్షపాతం నమోదైనప్పటికి సాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. వాతావరణం అనుకూలించి తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో పంట ఆశాజనకంగా పండింది. ఏలూరులో 5.2 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరిలో 5.68 లక్షల మెట్రిక్ టన్నులు వరకు దిగుబడి వస్తుందని అంచనా.

రైతులకు అండగా కొనుగోలు కేంద్రాలు

ఖరీఫ్ కోతలు మొదలు కావడంతో రైతులకు అండగా ప్రభుత్వం ఇప్పటికే ఏలూరు జిల్లాలో 281, పశ్చిమగోదావరి జిల్లాలో 314 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తోంది. 25 లక్షలకు పైగా గన్ని బ్యాగులను కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచారు. ధాన్యం రవాణాలో అక్రమాలకు తావులేకుండా వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

వాతావరణం చూసి కోతలు కోయాలి



ప్రస్తుతం ప్రతికూల వాతావరణం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతానికి ఇబ్బంది లేకపోయినప్పటికి వర్షం కురిసే అవకాశం ఉన్నప్పుడు కోతలు నిలిపివేసి అనుకూలించాక పనులు చేపట్టాలి. ఎక్కడైనా ధాన్యం వర్షానికి తడిస్తే మొలకలు రాకుండా ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారి చేయాలి. – జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ, భీమవరం

ఆందోళన కలిగిస్తున్న వాతావరణం



వరికోతకు సిద్ధంగా ఉన్న పంట పొలం

ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ చిరుజల్లులు పడుతుండటంతో పాటు చలిగాలులు వీస్తున్నాయి. మంగళవారం జిల్లాలోని తణుకు, అత్తిలి, పాలకొల్లు, ఇరగవరం, ఆచంట, పెనుగొండ, ఉండి, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలి ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి, ప్రస్తుతం వరి కోతల కోసం కొందరు రైతులు కూలీలను వినియోగిస్తుండగా అధికశాతం మంది వరికోత యంత్రాలకు మొగ్గుచూపుతున్నారు. తేమ శాతం తగ్గించేందుకు ధాన్యాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో ఆరబెడుతున్నారు. ప్రతికూల వాతావరణంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో నెలకొంది. కొందరు జల్లులను లెక్కచేయకుండా కోతలు కోస్తుండా, వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుందన్న ఆందోళన మరికొందరు కోతలు విరమించుకుంటున్నారని రైతులు అంటున్నారు. ఇప్పటికే కోతలు కోసిన వారు కళ్లాల్లోని ధాన్యం ఆరబెట్టుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. కొందరు ధాన్యం ఆరబెట్టి చినుకులు పడితే వెంటనే దగ్గరకు పోగుచేసేందుకు వీలుగా అక్కడే కాపాలా ఉంటున్నారు. ప్రస్తుత వర్షం వలన పంటకు పెద్దగా ప్రభావం లేకున్నా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడితే పంటకు నష్టం కలుగుతుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. కొద్దిరోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే తొలకరి పంటను గట్టెక్కించుకుంటామంటున్నారు.

వికసిత్ సంకల్పయాత్ర విజయవంతానికి కృషి

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉమా నండూరి

ఏలూరు(మెట్రో): జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతానికి అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉమా నండూరి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం యాత్ర నిర్వహణకు సంబంధించి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులైనప్పటికీ ఇప్పటివరకు సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందని లబ్ధిదారులను గుర్తించి వారికి లబ్ధిచేకూర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ముఖ్యంగా బ్యాంకర్లు, పోస్టల్, కృషి విజ్ఞాన కేంద్రం తదితర అధికారులు ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కేంద్ర పథకాలు పొందిన లబ్ధిదారుల అభిప్రాయాలు, సాధించిన ప్రగతిపై వివరాలు సేకరించాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంకల్పయాత్ర నిర్వహణకు సర్వ సన్నద్ధంగా ఉన్నామని ఇందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో పటిష్ట కార్యచరణ రూపొందించామన్నారు. కార్యక్రమం విజయవంతానికి అధికారులందరూ కృషి చేయాలని , ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమం పటిష్టంగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్‌ను నోడల్ అధికారిగా నియమించామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్. సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కులగణన సర్వేపై శిక్షణ

ఏలూరు(మెట్రో): కులగణన సర్వే జిల్లాలో నూరు శాతం పూర్తి చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కుల గణన ఆవశ్యకత, సలహా, సూచనల కోసం సమగ్ర, నిర్వహణపై జిల్లా, మండల స్థాయి కమిటీ సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో నవంబర్ 27వ తేదీ నుంచి కులగణన సర్వే ప్రారంభిస్తారని తెలిపారు. ఇప్పటికే జిల్లా, మండలస్థాయి కమిటీలను నియమించామని పేర్కొన్నారు. ఈ కులగణన సామాజిక విద్య, ఆర్థిక స్థితిని తెలుసుకోవడంలో సాయపడుతుందని, సంక్షేమ చర్యల్లో పొరపాట్లను గుర్తించి వాటి కారణాలను విశ్లేషించి అవసరమైన పరిష్కార చర్యలను తీసుకోవడానికి ఉపయోగపడుతుందని అన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయాల సెక్రటరీల ద్వారా కుల గణన చేపట్టి వారం రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. సర్వే కు సంబంధించిన జిల్లా కమిటీలో చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, మెంబరు, కన్వీనర్‌గా జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసరు, నోడల్ ఆఫీసరుగా చీఫ్ ప్లానింగ్ ఆఫీసరు ఉంటారన్నారు. మండలస్థాయి కమిటీలో ఎంపీడీఓ, తహశీల్దారు, మున్సిపల్ కమిషనరు, ఈవోపీఆర్‌డీ, మండల ఇంజినీరు, ఎంఈఓ తదితరులు ఉంటారని చెప్పారు.ఈ శిక్షణా తరగతుల్లో కులసర్వే పై పూర్తి అవగాహన పెంచుకొని మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కులాలలో సబ్ కమ్యూనిటీలు కూడా ఉన్నాయని వాటిని గుర్తించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సంచార జాతుల వారిని కూడా గుర్తించాలని తెలిపారు. సర్వే ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం వరకు చేపట్టడం వల్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు వెళ్లే వారి నుంచి సమాచారం సేకరించవచ్చని తెలిపారు. కులగణన సర్వేను ప్రభుత్వ పథకాలకు లింకు చేయరని, సర్టిఫికెట్లకు లింక్ చేయరని కలెక్టర్ స్పష్టంచేశారు. మండల స్థాయి కమిటీ సభ్యులు గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలకు, వలంటీర్లకు సర్వే ప్రక్రియపై శిక్షణ ఇవ్వాలని దీనిపై పర్యవేక్షణ చేపట్టి ఏరోజుకారోజు సర్వే ప్రక్రియ నివేదికను తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ డా. ఆర్.విజయరాజు, జెడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్.సుబ్బారావు, కుల గణన సర్వేపై జిల్లా, మండల స్థాయి కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

టీడీఎస్ చెల్లింపుల్లో అశ్రద్ధ వద్దు

పాలకొల్లు సెంట్రల్: టీడీఎస్ చెల్లించే వ్యక్తులు క్రమం తప్పకుండా ప్రతీ నెలా చెల్లించాలని ఏలూరు ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో చాంబర్స్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహారావు అధ్యక్షతన టీడీఎస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగదు చెల్లించే ముందు టీడీఎస్ కట్ చేసుకుని నగదు చెల్లిస్తామన్నారు. ప్రతి నెలా 7 లోపు టీడీఎస్ చెల్లించాలన్నారు. మూడు నెలలకు ఒకసారి టీడీఎస్ వివరాలతో రిటర్న్లు తప్పనిసరిగా వేయాలన్నారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- ఏలూరులో ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ ప్రారంభం



ఫిష్ ఆంధ్ర లేఅవుట్‌ను ప్రారంభించిన ఆళ్ల నాని

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయం మెయిన్ గేట్ వద్ద రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర అవుట్ లేట్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే ఆళ్ళ నాని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆళ్ళ నాని మాట్లాడుతు చేపల వినియోగాన్ని ప్రోత్సహించి, మత్స్య ఉత్పత్తుల వినియోగంగా పెంచేలా ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్లను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నుంచి మత్స్యకారులకు జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకార భరోసా, డీజిల్ సబ్సిడీ వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. మత్స్యకార భరోసా కింద ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఫిష్ ఆంధ్ర కార్యక్రమం కింద ఇప్పటికే కొన్ని వందల అవుట్ లేట్ల ఏర్పాటయ్యాయన్నారు. వీటి ఏర్పాటుకు ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ కల్పిస్తుందని మిగిలిన 40 శాతంలో 10 శాతం లబ్ధిదారుడి వాటా కాగా మిగతా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. ఏలూరు జిల్లాలో సుమారు 137 మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేశామని, ఇందుకోసం రూ.86 లక్షల సబ్సిడీ కింద విడుదల చేశామన్నారు. జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ మత్స్య సంపదలో రాష్ట తలసరి వినియోగం 8 కేజీల నుంచి 25 కేజీల వరకు పెంచాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా ప్రోత్సహిస్తున్నారన్నారు. ఫిష్ ఆంధ్ర విక్రయ కేంద్రాల ద్వారా అన్నివర్గాల ప్రజలకు చేపలు అందుబాటులోకి తీసుకురావడానికి మినీ ఫిష్ ఆంధ్ర షాపులు, 10 లక్షల యూనిట్ ఖరీదు గల కియోస్కులు, రెస్టారెంట్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో 137 మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్లతో పాటు పలు మత్స్య సంబంధిత కార్యక్రమాల అమలుకు రూ.3.28 కోట్ల సబ్సిడీని విడుదల చేశామన్నారు. ఏలూరు జిల్లాలోని కలిదిండి మండలంలో రూ.కోటి వ్యయంతో ఆక్వా హబ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, మత్స్య శాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ జీవీవీ సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ రాజ్‌కుమార్, బి.నర్సయ్య, ఎఫ్‌డీవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పేలుడు బాధితులకు అండగా ఉంటాం

పోడూరు: ఆచంట మండలం వల్లూరుతోట గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు, బాధితులకు అండగా నిలుస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంలో ఇద్దరు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మంగళవారం పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు క్షతగాత్రులను పరామర్శించారు. మృతి చెందిన దివి వెంకట్రావు, ఆదిలక్ష్మిల గ్రామం వల్లూరుతోట వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గ్యాస్‌సిలిండర్ పేలుడుకు కారణాలు ఏమిటో నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. ఆచంట నియోజకవర్గంలోని గ్రామాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినపుడు ఫైర్ ఇంజిన్లు రావడానికి ఆలస్యమవుతున్నందున ఆచంటలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణానికి ఇప్పటికే స్థలం కేటాయించామని, త్వరలోనే పనులు కూడా ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట ఆచంట ఏఎంసీ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య ఉన్నారు.

కార్తీక మాసం.. నిత్యాన్నదానం

- భీమవరం పంచారామ క్షేత్రం వద్ద కొనసాగుతున్న అన్నప్రసాద వితరణ
- సోమవారాల్లో 20 వేల వరకు, సాధారణ రోజుల్లో ఐదు వేల వరకు భక్తుల తాకిడి
- అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో 21 ఏళ్లుగా అన్నదానం
- 100 క్వింటాళ్ల బియ్యం ఇచ్చిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



అన్నదానంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం



భోజనం చేస్తున్న భక్త జనసందోహం

భీమవరం(ప్రకాశం చౌక్): కార్తీక మాసంలో భీమవరం పంచారామక్షేత్రానికి వచ్చే భక్తులకు నెల రోజుల పాటూ నిత్యం అన్నప్రసాదం అందించడం విశేషం. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఉదయం 10 నుంచి సాయంత్రం గంటల వరకు అన్నదానం చేస్తున్నారు. కార్తీకమాసంలో సోమవారాల్లో 15 వేల నుంచి 20 వేల మంది, సాధారణ రోజుల్లో మూడు వేలు నుంచి ఐదు వేలు వరకు భక్తులు వస్తున్నారు. దాతలు, భక్తులు సహకరంతో శ్రీ ఉమాసోమేశ్వర కార్తీక అన్నసమారధన కమిటీ గత 21 ఏళ్లగా పంచారామక్షేత్రం వద్ద కార్తీక మాసంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోంది.

యాత్రీకుల హర్షం : పంచారామాల యాత్రీకులు మొదటిగా అమరావతి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మధ్యాహ్నానికి భీమవరం చేరుకుంటారు. ఇక్కడ స్వామి వారిని దర్శించుకున్న యాత్రీకులకు దేవస్థానం వద్దే అన్నదాన కమిటీ భోజన సౌకార్యం కల్పిస్తోంది. దీంతో భక్తులు మిగిలిన పంచారామాలను నిర్ణీత సమయానికి చేరుకుని సకాలంలో శివయ్యను దర్శించుకుంటున్నారు. రాష్ట్రం, జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటు, భీమవరం చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే భక్తులకూ అన్నప్రసాదం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో యాత్రీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కమిటీకీ, దాతలకు అభినందనలు తెలుపుతున్నారు.

భోజనం మెనూ : అన్నప్రసాదంలో పూర్తి నాణ్యత పాటిస్తారు. స్వీట్, పులిహోర, పప్పు, పచ్చడి, రెండు కూరలు, కార్తీక మాసం ప్రత్యేకంగా కంద బచ్చలి, అన్నం, సాంబారు, పెరుగు తదతర వాటితో భక్తులకు భోజనం వడ్డిస్తారు.

అన్నదానం ప్రారంభం : కార్తీక మాసం ప్రారంభమైన ఈనెల 14వ తేదీ నుంచి పంచారామ క్షేత్రం వద్ద అన్నదాన కమిటీ అన్నప్రసాద వితరణ చేస్తోంది. సోమవారాల్లో సుమారు 20 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. నిత్యం మూడు నుంచి ఐదు వేల మంది భోజనం చేస్తున్నారు.

100 క్వింటాళ్ల బియ్యం వితరణ


కార్తీకమాసంలో నిత్యాన్నదానానికి భీమవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ 100 క్వింటాళ్ల నాణ్యమైన బియ్యాన్ని ఇటీవల అందజేశారు. అన్నదాన కమిటీకి పలు సలహాలు ఇచ్చారు. అన్నప్రసాద వితరణలో పూర్తిసహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అభినందనీయం



పంచారామ క్షేత్రం దర్శనానికి వచ్చే భక్తులకు భోజనానికి ఇబ్బందులు లేకుండా ఆలయం వద్దే అన్నదాన కమిటీ భోజన సౌకర్యం కల్పించడం బాగుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామి దర్శనం చేసుకున్న తర్వాత బయటకెళ్లి ఇబ్బందులు పడకుండా నాణ్యమైన అన్నప్రసాదరం అందజేయడం అభినందనీయం.
– కె.శ్రీనివాస్ శ్రీకాకుళం

యాత్రికులకు సౌకర్యవంతం



ఉమసోమేశ్వ కార్తీకమాస అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు గత 21 ఏళ్లగా కార్తీక మాసంలో అన్నదానం చేస్తున్నారు. ఇది యాత్రీకులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంది. కార్తీకమాసం మొదటి సోమవారం దాదాపు 11 వేల మంది భక్తులు ఇక్కడ అన్నప్రసాదం స్వీకరించారు. అన్నదాన కమిటీకి దేవస్థానం తరపున పూర్తిసహకారం అందిస్తున్నాం.
– డి.రామకృష్ణంరాజు, ఈఓ, పంచారామక్షేత్రం

ఆకలి తీరుస్తున్నారు



స్వామివారిని దర్శించుకున్న తర్వాత వృద్ధులు, పిల్లలు, ఇతర భక్తుల ఆకలిని అన్నదాన కమిటీ తీర్చడం హర్షణీయం. దేవస్థానం వద్దే భోజనం ఏర్పాటు చేయడంతో భీమవరం పట్టణంలో హోటల్స్‌కు వెళ్లి భోజనం కోసం ఇబ్బందులు పడే బాధ ఉండదు. భక్తుల సమయం వృథాకాకుండా మిగిలిన పంచారామాలకు వెళ్లుతున్నారు.
– కె.రత్తమ్మ విజయవాడ

గొప్ప సేవా కార్యక్రమం



పంచారామ క్షేత్రం వద్ద అన్నదాన కమిటీ అందిస్తోన్న భోజనం చాలా నాణ్యతతో ఉంది. కార్తీక మాసంలో భక్తులు తీసుకునే ప్రత్యేక వంటకాలు కూడా భోజనంలో ఉండడం విశేషం. మాలధారణ చేసిన భక్తులు కూడా ఇక్కడ సమాయానికి భోజనం చేసేలా సౌకర్యం కల్పించారు. అన్నదాన కమిటీ గొప్ప సేవా కార్యక్రమం చేపట్టింది.
– కె.కామేశ్వరరావు, పిఠాపురం

రోడ్ల అభివృద్ధి వేగవంతం

- జంగారెడ్డిగూడెం డివిజన్లో రూ.107 కోట్లతో పనులు
- ఆర్అండ్ఆర్ కాలనీకి అప్రోచ్ రోడ్లు
- జగనన్నకు చెబుదాం కింద రోడ్ల పనులు చేపట్టిన ఆర్అండ్‌బీ శాఖ
- వరదల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు


నిర్మాణం పూర్తయిన మేడేపల్లి - వేలేరుపాడు రోడ్డు


నిర్మాణ పనులు చేపట్టిన కొయ్యలగూడెం - కన్నాపురం రోడ్డు


నిర్మాణంలో ఉన్న గాజులగొంది - కొరుటూరు రోడ్డు

జంగారెడ్డిగూడెం: జిల్లాలోని ప్రధాన మార్గాలతో పాటు, ఆయా గ్రామాలను కలిపే లింకు రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. వరదలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల పునర్నిర్మించనున్నారు. ఐటీడీఏ పరిధిలో ఏజెన్సీ రోడ్లను కూడా అభివృద్ధి చేస్తున్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలకు అప్రోచ్ రోడ్లు, లింక్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్అండ్‌బీ డివిజన్ పరిధిలో పలు రోడ్ల అభివృద్ధి చేపట్టారు. కొన్ని రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తి కాగా మరికొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని రోడ్లకు ప్రతిపాదనలు చేశారు.

రూ.59.30 కోట్లతో రోడ్ల నిర్మాణం

జంగారెడ్డిగూడెం ఆర్అండ్‌బీ డివిజన్ పరిధిలో ఎస్‌టీసీ నిధులు రూ.59.30 కోట్లతో పలు రోడ్ల నిర్మిస్తున్నారు. వినాయకపురం - రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు రూ.2 కోట్లతో చేపట్టారు. ఈ నిర్మాణం కొంత వరకు పూర్తయింది. శ్రీధర వేలేరు నుంచి లంకాలపల్లి రోడ్డు నిర్మాణానికి రూ.34 కోట్లు వెచ్చించనున్నారు. బుట్టాయగూడెం - దొరమామిడి - పూచికపాడు రోడ్డు నిర్మాణం రూ.7.54 కోట్లతో చేపట్టారు. రేపల్లెవాడ - కొత్తదేవరగొంది రోడ్డు నిర్మాణానికి రూ.4.15 కోట్లు కేటాయించారు. బర్రింకలపాడు - రాచన్నగూడెం - పూచికపాడు నిర్మాణానికి రూ.5.20 కోట్లు కేటాయించారు. బయ్యనగూడెం - రేగులకుంట రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు వెచ్చించనున్నారు.

దెబ్బతిన్న రోడ్ల నిధులు

ఇటీవల వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో బూర్గుంపాడు నుంచి అశ్వారావుపేట రోడ్డును లింక్ చేస్తూ నిర్మించే రోడ్డుకు రూ.40 లక్షలు కేటాయించారు. కుక్కునూరు - దాచారం రోడ్డుకు రూ.15 లక్షలు, కుకునూరు - అశ్వారావుపేట రోడ్డు - రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, వసంతవాడ - రుద్రమ్మకోట వరకు మరమ్మతులకు రూ.15 లక్షలు, రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు - కొయిదా రోడ్డు మరమ్మతులకు రూ.30 లక్షలు వెచ్చించనున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

వరదల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయనున్నారు. వీటిలో చింతలపూడి - కామవరపుకోట - మక్కినవారిగూడెం రోడ్ల మరమ్మతులకు రూ.50 లక్షలు, పాంగుటూరు - లక్కవరం రోడ్డు మరమ్మతులకు రూ.25 లక్షలు, శ్రీనివాసపురం - పందిరిమామిడిగూడెం రూ.24.60 లక్షలు, బర్రింకలపాడు - పూచికపాడు రోడ్డు మరమ్మతులకు రూ.20 లక్షలు, శ్రీనివాసపురం - పందిరిమామిడిగూడెం రోడ్డు మరమ్మతులకు రూ.15 లక్షలు, బుట్టాయగూడెం - కంగాలవారిగూడెం రోడ్డు మరమ్మతులకు రూ.7.70 లక్షలు, బర్రింకలపాడు - పూచికపాడు రోడ్డులో ఉన్న కల్వర్టు నిర్మాణానికి రూ.25.50 లక్షలు వెచ్చించనున్నారు. పోలవరం - కొయ్యలగూడెం రోడ్డు మరమ్మతులకు రూ.48.40 లక్షలు, యర్రగుంటపల్లి - లక్ష్మీపురం రోడ్డు మరమ్మతులు రూ.52 లక్షలు, చింతలపూడి - రావికంపాడు రోడ్డు మరమ్మతులకు రూ.36 లక్షలు, ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డు, టి.నరసాపురం - అశ్వారావుపేట రోడ్డు మరమ్మతులకు రూ.23 లక్షలు, చేబ్రోలు దేవులపల్లి రోడ్డు మరమ్మతులకు రూ.12 లక్షలు అంచనాతో ప్రతిపాదనలు చేశారు.

ఐటీడీఏ పరిధిలో..

పోలవరం - కొయ్యలగూడెం రోడ్డు, ఏజీఆర్‌బీ రోడ్డు, శ్రీనివాసపురం - పందిరిమామిడిగూడెం రోడ్డు, కుక్కునూరు - దాచవరం రోడ్డు, బర్రింకలపాడు - పూచికపాడు రోడ్డు, రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు - కొయిదా రోడ్డు, బుట్టాయగూడెం - కంగాలవారిగూడెం రోడ్డు నిర్మాణానికి రూ.12.31 కోట్లతో ప్రతిపాదనలు చేశారు.

ఆర్అండ్ఆర్ కాలనీలకు లింక్ రోడ్లు

ఆర్అండ్ఆర్ కాలనీలకు లింక్ రోడ్లు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఈ పనులను ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.10.57 కోట్లు కేటాయించారు. ఈ పనులకు టెండర్లు ఖరారు కాగా, త్వరలో పనులు చేపట్టనున్నారు. ఉప్పేరు, రెడ్డిగణపవరం (తూటికుంట), పి.నారాయణపురం (కొరుటూరు), ములగలంపల్లి, సాగిపాడు, స్వర్ణవారిగూడెం, వంకా వారిగూడెం, సరిపల్లి, గర్భగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలకు లింక్ రోడ్లు వేయనున్నారు.

'జగనన్నకు చెబుదాం'లో..

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పలు రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. చేబ్రోలు - దేవులపల్లి రూ.4 కోట్లు, చింతలపూడి - రావికంపాడు రోడ్డు రూ.4.50 కోట్లు, శ్రీనివాసపురం - పందిరిమామిడిగూడెం రోడ్డు రూ.3.85 కోట్లు, యర్రగుంటపల్లి లక్ష్మీపురం రోడ్డుకు రూ.4.15 కోట్లు, పోలవరం కొయ్యలగూడెం రోడ్డు రూ.3.89 కోట్లు వెచ్చించనున్నారు.

ఆర్అండ్ఆర్ కాలనీకి లింకు రోడ్లు



ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతంచేశాం. ఇప్పటికే కొన్ని రోడ్ల నిర్మాణం పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. మరికొన్ని రోడ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. వాటి పనులు త్వరలో ప్రారంభిస్తాం. అలాగే ఆర్అండ్ఆర్ కాలనీకి లింకు రోడ్లు నిర్మాణం కూడా చేపడుతున్నాం. వరదలకు దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వాటి పనులు ప్రారంభిస్తారు.

– సీహెచ్ హరికృష్ణ, ఆర్అండ్‌బీ డీఈ

క్లుప్తంగా

కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థిని ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముసునూరు: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యాలయం తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.జ్యోతి ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ కె.ప్రవీణ తెలిపారు. ఇటీవల అన్నమయ్య జిల్లా చిట్వేల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో తమ పాఠశాల విద్యార్థినులు అసమాన ప్రతిభ కనబర్చారని పేర్కొన్నారు. 2024 జనవరి 28న రాజంపేటలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున జ్యోతి పాల్గొననున్నట్టు తెలిపారు. జ్యోతిని, పీఈటీ నాగమల్లేశ్వరిని మంగళవారం పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

వెనుకబడిన విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక కృషి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ప్రభాకరరావు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, జూనియర్ కళాశాలల విద్యార్థుల్లో వెనుకబడిన వారిని గుర్తించి పురోభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయాలని ఏలూరు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.ప్రభాకరరావు అన్నారు. మంగళవారం స్థానిక వృత్తి విద్యాశాఖ కార్యాలయంలో ప్రభుత్వ, ఎయిడెడ్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థుల యూనిట్, త్రైమాసిక పరీక్ష ఫలితాలు గుర్తించాలని, గత విద్యా సంవత్సరంలో ఫెయిల్ అయిన వారినీ గుర్తించి వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణులయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించే నాలుగో యూనిట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని, అకడమిక్ ఆర్గనైజర్ ప్రకారం పాఠ్యాంశాలు బోధించాలని అన్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో విద్యార్థి ప్రగతిపై దృష్టి సారించి పబ్లిక్, ప్రాక్టికల్, థియర్ పరీక్షల్లో ఉత్తీర్ణతకు తగుచర్యలు తీసుకోవాలన్నారు.

భీమడోలులో చోరీలకు విఫలయత్నం


శివాలయంలో హుండీని పరిశీలిస్తున్న ఎస్సై

భీమడోలు: పోలసానిపల్లి, భీమడోలు గ్రామాల్లో సోమవారం అర్ధరాత్రి ఇద్దరు అగంతకులు చోరీలకు విఫలయత్నం చేశారు. ముఖాలకు ముసుగులు వేసుకుని చేతులకు గ్లౌజులు ధరించిన ఇద్దరు అగంతకులు పలు షాపుల షెట్టర్లన పగుల కొట్టే ప్రయత్నం చేశారు. పోలసానిపల్లి శివాలయంలో హుండీని పగులకొట్టారు. మెడికల్ షాపులో నగదు దొంగిలించారు. దేవరపల్లి పరిసర ప్రాంతాల్లో దొంగించిన రెండు మోటార్ బైక్‌లు వేసుకుని జాతీయ రహదారి మీదుగా పోలసానిపల్లి వచ్చి శివాలయంలో హుండీని పగులు కొట్టి నగదు దోచుకెళ్లారు. అక్కడ నుంచి భీమడోలు జంక్షన్, భీమడోలు ప్రాంతంలో మెడికల్ షాపులు, పలు దుకాణాల్లో షెట్టర్లను పగులకొట్టి చోరీకి సిద్ధపడగా సెక్యూరిటీ గార్డులు అడ్డుకొని ఎస్సై చావా సురేష్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే తన సిబ్బందితో ఘటనా స్థలాలకు ఎస్సై చేరుకున్నారు. అగంతకులు బైక్‌లపై పరారవుతుండగా పోలీసులు వెంబడించడంతో వారు బైక్‌లను వదిలి పారిపోయారు. వారు దొంగతనాలకు విఫలయత్నం చేయడాన్ని సీసీ పుటేజీల్లో పోలీసులు గుర్తించారు. పోలసానిపల్లిలోని శివాలయంలో హుండీ పగుల కొట్టి అందులో సొమ్మును అపహరించారు. ఘటనా స్థలిని ఎస్సై సందర్శించి ఈఓ రాధ, అర్చకులు భాస్కర్‌ల నుంచి వివరాలు సేకరించారు.

24న విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు

భీమవరం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఈనెల 24న ఏలూరులో విభిన్న ప్రతిభావంతులకు జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు పి.రాకడమణి మంగళవారం తెలిపారు. ఏలూరు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న క్రీడామైదానంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మూడు చక్రాల రిక్షా రేస్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, పరుగు పందెం, షాట్‌పుట్, క్యారమ్స్, సాఫ్ట్‌బాల్, డిస్క్‌స్త్రో వంటి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


బువ్వనపల్లి వైద్య శిబిరంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి శర్మిష్ఠ

నిడమర్రు: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారిణి ఎస్ శర్మిష్ఠ అన్నారు. బువ్వనపల్లి గ్రామంలో ఇటీవల డెంగీ జ్వరాల బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో మంగళవారం శర్మిష్ఠ పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలోని రికార్డులను పరిశీలించారు. ఇటీవల నమోదైన జ్వరం కేసులు, వారి రక్త నమూనా పరీక్షల రిపోర్టులపై ఆరా తీశారు. జ్వరాలపై మరోసారి సర్వే చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు కూడా ఖచ్చితమైన సమాచారం వైద్య బృందాలకు అందించాలని కోరారు. గ్రామంలోని రెండు వైఎస్సార్ క్లినిక్స్‌లో 14 రకాల రక్త పరీక్షలు చేస్తున్నట్టు చెప్పారు. జ్వరం కేసులు పూర్తిగా తగ్గేవరకూ వైద్య శిబిరాలు కొనసాగించాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కె.నాగేశ్వరరావు జిల్లా సర్వేలెన్స్ అధికారి డాక్టర్ నరేంద్ర, డాక్టర్ తేజశ్రీ, ఆరోగ్య విస్తరణ అధికారి పి.కృపావరం, వై లక్ష్మణరావు, ఎస్‌వీ ప్రియదర్శిణి తదితురులున్నారు.

రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి, హాజరైన పోలీస్ అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ల పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్‌స్పాట్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుపై సూచనలు చేశారు. రోడ్డు సేఫ్టీ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ, పోలీస్ తదితర ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో జాతీయ రహదారులపై బ్లాక్ స్పాట్స్ వద్ద రేడియం స్టిక్కర్లతో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని జాతీయ రహదారులపై గుర్తించిన బ్లాక్ స్పాట్స్‌తో పాటు అప్రోచ్ రోడ్లపై ప్రమాద హెచ్చరిక బోర్డులు, క్యాట్‌ఐస్‌లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాల సంఖ్య తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. రాత్రివేళల్లో వాహనదారులకు ఫేస్‌వాష్ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. నిర్ణీత సమయాల్లో హైవేపై ఉన్న దాబాలను మూయించాలన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ఎస్‌బీ సీఐ వి.ఆదిప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ ఎం సుబ్బారావు, డీటీఆర్‌బీ ఎస్సై రాంబాబు ఉన్నారు.

తేజ ఆత్మహత్య కేసులో భార్య, అత్తమామల అరెస్టు

దెందులూరు: దెందులూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తేజోమూర్తి ఆత్మహత్య కేసులో ఆయన భార్య నాగప్రియాంక, మామ సత్యనారాయణ, అత్త సూర్యకుమారిలను అరెస్టు చేసినట్టు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన దెందులూరు పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. చెక్కా తేజో మూర్తి, ఏలూరుకు చెందిన రవ్వా నాగప్రియాంక గతేడాది అక్టోబర్‌లో హైదరాబాద్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారని చెప్పారు. దీంతో నాగప్రియాంక తండ్రి సత్యనారాయణ, అత్త సూర్యకుమారిలు తేజోమూర్తిని అల్లుడుగా అంగీకరించలేదన్నారు. ఈ ఏడాది ఆగస్టులో వరలక్ష్మి వ్రతం నాగప్రియాంక పుట్టింటి వద్ద చేద్దామని తేజోమూర్తికి చెప్పగా వద్దనడంతో వివాదం తలెత్తిందని చెప్పారు. దీనికితోడు తేజోమూర్తికి ఉద్యోగరీత్యా వేరే స్త్రీలతో ఫోన్‌లో మాట్లాడటంతో భార్య అక్రమసంబంధం అంటగట్టడంతో మనస్పర్ధలు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో నాగప్రియాంక ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని చెప్పారు. దీంతో తేజోమూర్తి ఇష్టపడి పెళ్లి చేసుకుంటే ప్రియాంక తల్లిదండ్రులతో పాటు బంధువులు సౌజన్య, సురేష్‌కుమార్‌ల ప్రోత్సాహంతో తనపై అక్రమంగా కేసు పెట్టి వేధింపులకు గురిచేసిందని, తన చావుకు భార్య ప్రియాంక, మామ సత్యనారాయణ, అత్త సూర్యకుమారిలే కారణమని సూసైడ్ నోట్ రాసి సెప్టెంబర్ 4న రైలు కింద పడి మృతి చెందాడని వివరించారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై కృష్ణ పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం


జంగారెడ్డిగూడెం : 7వ సచివాలయం పరిధి 20వ వార్డులో లబ్ధిదారునికి పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా


నిడమర్రు: అడవికొలనులో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గురుకుల విద్యార్థి ఆత్మహత్య


దోసె కమలేశ్ (ఫైల్)


పెదవేగి గురుకుల విద్యాలయంలో విద్యార్థులను విచారణ చేస్తున్న అధికారులు

పెదవేగి : గురుకుల విద్యాలయం విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో భీమడోలు మండల శివారు అజ్జావారిగూడెంకు చెందిన దోసె కమలేశ్ (15) పదో తరగతి చదువుతున్నాడు. అతని తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు (తంబి), రూతు మనస్పర్ధలతో ఏడేళ్ల కితం పెద్దల సమక్షంలో విడిపోయారు. తల్లి రూతు చిన్న కుమారుడిని తీసుకొని చింతలపూడిలో నివాసం ఉంటోంది. తండ్రి వద్ద ఉన్న పెద్ద కుమారుడు కమలేశ్ గురుకులు విద్యాలయంలో సోమవారం రాత్రి వసతి గృహం పక్కనే అవరణలో ఉన్న చెట్టుకు ఉరివేసుకున్నాడు. సిబ్బందికి సమాచారం అందించడంతో అర్ధరాత్రి కమలేశ్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే కమలేశ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెదవేగి తహసీల్దార్ నాగరాజు సమక్షంలో ఎస్సై ఎం లక్ష్మణ్ శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రభుత్వాసుపత్రిలో ఉన్న కమలేశ్ మృతదేహాన్ని దళిత సంఘాల నాయకులు సందర్శించారు. గురుకుల విద్యాలయంలో పరిస్థితులను పరిశీలించారు. కమలేశ్ మృతదేహాన్ని పరిశీలించిన ఆర్డీఓ ఎన్ఎస్కే ఖాజావలి, జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ సుందర్, గురుకుల విద్యాలయాల కన్వీనర్ నోముల సంజీవరావు విద్యాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఉత్తీర్ణత సాధించలేనని కమలేశ్ ఆందోళనకు గురైనట్లు తోటి విద్యార్థులు చెప్పారని ఆర్డీఓ తెలిపారు. కమలేశ్ మృతిపై అన్ని కోణాల్లోనూ విచారణ చేస్తున్నామని, కమలేశ్ కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా జూలై నెలలో సెలవులకు ఇంటికెళ్లిన కమలేశ్ తిరిగి వచ్చేటప్పుడు మద్యం సీసా తీసుకొచ్చాడని, అది తెలిసిన ప్రిన్సిపాల్ తండ్రిని పిలిపించి కమలేశ్‌ను మందలించడం, కమలేశ్ తల్లిప్రేమకు నోచుకోకపోవడం తదితర కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

24 నుంచి అంతర్ కళాశాలల ఆటల పోటీలు

పెదపాడు : స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 24 నుంచి 26 వరకు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం కాకినాడ పరిధిలోని కళాశాలల మధ్య ఆటల పోటీలతో పాటు విశ్వ విద్యాలయ జట్టుల ఎంపిక ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. 24న మార్చ్‌ఫాస్టుతో పోటీలు ప్రారంభమవుతాయని, డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, 1,412 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. వాలీబాల్ జట్లు 50, మహిళల జట్లు 14, హ్యాండ్ బాల్ పురుషుల జట్లు 12, మహిళల జట్లు 7, నెట్‌బాల్ పురుషుల జట్లు 8, మహిళల జట్లు 33, మహిళల జట్లు 11 పాల్గొంటాయని, 26 మంది అధికారులు, 50 మంది ఫిజికల్ డైరెక్టర్లు, 10 మంది మహిళా ఫిజికల్ డైరెక్టర్లు నుంచి పీఈటీ కాలేజీ నుంచి 10 మంది ట్రైనీలు పర్యవేక్షిస్తారని వివరించారు. విజేతకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, చాంపియన్ ట్రోఫీ ప్రదానంతో పాటు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన వారు జేఎన్‌టీయూ కాకినాడ జట్టుకు, అనంతరం అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు అల్లూరి ఇంద్రకుమార్, ఇన్‌చార్జి సెక్రటరీ కిలారు ప్రభాకరరావు, కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, మేనేజింగ్ కమిటీ సభ్యుడు కె.హరి రామకృష్ణంరాజు పాల్గొంటారని తెలిపారు.